# ప్రేమామృతం

**జననం నుంచి మరణానికి సాగే ఈ మూడునాళ్ళ జీవితయాత్రలో అప్యాయతలూ, అనురాగాలే విలువైనవి. ఆస్తిపాస్తులు కావు. అలాంటి మమతానుబంధంలోని తీపిని తెలిపే కథ**

పనస తొనల్లాంటి తియ్యటి పలుకులవి!... "అమ్మా ఎల్లొస్తా, నాన్నా ఎల్లొస్తా, అక్కా ఎల్లొస్తా, అన్నా ఎల్లొస్తా..." పదను పెట్టిన కొత్త చురకత్తి లాంటి లేత గొంతుక.

తేనె గిన్నె బుడుంగున దొర్లిపోయినట్లు, ఈ మాటలన్నీ ఒక్కసారిగా ఒలికిపోతై వాడి నోట్లోంచి.

ప్రతినిత్యం ఉదయం పూట బడివేళ కావస్తున్నప్పుడు కంటిమీద రెప్ప వేయకుండా ఆ ఇంటి ముంగిట్లోకి వంగి చూస్తుంది ఆకాశం, వాడు సెలవు పుచ్చుకునే వైనం చూడడానికి! ఆ ఇంటిని ఆవరించి వేచి ఉంటుంది గాలి, వాడి ఆ మాటలతో కొత్త ఊపిరులు పోసుకోవడానికి!

ఆ చుట్టుపక్కల అయిదారు ఇళ్ళలోని వారు కూడా ఆ మాటలు విని పులకించి పోతారు. ఉదయం ఎనిమిది, ఎనిమిదిన్నర గంటలు దాటాక ఆ మాటలు వినడం కోసమే వేచి చూస్తారు వాళ్ళు. విని ముసిముసి నవ్వులు నవ్వుకుంటారు. "ఎంత మంచి కుర్రాడబ్బా" అనుకుంటూ తమ తమ పనుల్లో నిగ్నమైపోతారు.

వాడి పేరు సుబ్బూ. ఒంటికి అతుక్కున్నట్లున్న నిక్కరు, చొక్కాతో ఎర్రగా బుర్రగా ఏ సుమో వీరుడో బాల్యంలో ఉన్నట్లు బొద్దుగా, ముద్దుగా ఉంటాడు. ఏడో తరగతి చదువుకుంటున్నాడు.


ఇంట్లో సుబ్బూ ఉన్నంతసేపూ మహానందడి. వాడు లేకపోతే నిశ్శబ్దమే! బడికి వెళ్ళి రావడం కూడా ఒక పెద్ద ఎడబాటన్నట్లుగా ఆ గారాల కుర్రాడు ఇంట్లో ఎవరెవరైతే ఉన్నారో వాళ్ళందర్నీ పేరు పేరునా పిలిచి, వెళొస్తానని చెబుతుంటాడు. వాళ్ళు ఎక్కడో కూతవేటు దూరంలో ఉన్నారన్నట్లుగా బిగ్గరగా కేకలేసి చెప్పి, భుజాన పుస్తకాల సంచీతో గుర్రంలా దౌడు తీస్తుంటాడు. వాడి దృష్టిలో తన దిన చర్యలలో కెల్లా ప్రధాన అంశం అలా చెప్పి వెళ్ళడమేనేమో అనుకోవాలి మనం.

ఆ కాలనీలో విశాలమైన ఆవరణలో కొత్తగా కట్టుకున్న చిన్న డాబా ఇల్లు అది. ఆ ఇంట్లో ఆ అయిదారుగురూ కాక, మరో వ్యక్తి కూడా ఉన్నాడు. డెబ్బై ఏళ్ళు దాటిన సీతారామయ్య. పేరుకు సీతారామయ్యే గానీ, బతుకులో ఇప్పుడతను ఉత్త రామయ్య. ఆ చిన్న ఇంటి ముందరున్న చిన్న వరండాలోని పాత నులక మంచం ఆయనదే! ఆ పాత నులక మంచానికి నోరు లేదుగానీ, ఉంటే సీతారామయ్య కథంతా చెప్పదూ!

అతను పుట్టిందీ, పెరిగిందీ మరో చోట. స్థిర పడింది గంగాసాగరంలో. గంగాసాగరం ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా ఉద్యోగంలో చేరిన కొత్తలో కొన్నారు ఆ నులక మంచాన్ని. ఇప్పటికీ ఆ నులక మంచమే తనకు తోడు! తన సర్వీసంతా నిరాఘాటంగా గంగా సాగరంలోనే గడిచిపోయింది. అక్కడే రిటైరయ్యాడు.

అంతకు ముందూ, ఆ తరువాతా ఎన్నో విశేషాలు జరిగిపోయాయి. పెళ్ళి చేసుకున్న కొంత కాలానికే భార్య ఓ కొడుకును కని, కన్ను మూసింది. సీతారామయ్య మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. కొడుకును పెంచి పెద్ద చేశాడు. సమితి ప్రెసిడెంట్ కాళ్ళా వేళ్ళా పట్టుకొని, ఇంటర్ పరీక్ష తప్పిన కొడుక్కి ఓ చిన్న ఉద్యోగం ఇప్పించుకొన్నాడు. తన మంచితనమే మూలధనంగా ఊరి జనం సహకారంతో రెండతస్తుల మేడ ఒకటి కట్టించాడు. కొడుక్కి పిల్లను వెతికి పెళ్ళి చేశాడు. పది హేనేళ్ళ క్రితం ఉద్యోగ విరమణతో వచ్చిన సొమ్ముతో సిరవాడ శివారులోని నల్లగుట్ట కాలనీలో విశాలమైన ఇంటి స్థలం ఒకటి కొన్నాడు. నెలనెలా వచ్చే పెన్షన్ డబ్బుల్ని మూడో కంటికి చూపకుండా బ్యాంకు ఖాతాలో వేసుకుంటున్నాడు. కొడుక్కి ముగ్గురు పిల్లలు కలిగారు. ఓ ఆడపిల్ల, ఇద్దరు మగ పిల్లలు. వాళ్ళకు చదువు బాగా ఒంటబడుతోంది. అమ్మాయి పెద్దమనిషైంది. ఆ తరువాత పదో తరగతి ప్యాసైంది. గంగాసాగరం చిన్న టౌను. అక్కడ హైస్కూలు ఉంది. జూనియర్ కాలేజీ లేదు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సిరవాడ కాస్త పెద్ద టౌను. అక్కడ జూనియర్ కాలేజీ కూడా ఉంది. మనుమరాలి సౌకర్యం కోసం సిరివాడకు మకాం మార్పించాడు సీతారామయ్య. నల్లగుట్ట కాలనీలో తన ప్లాటుకు దగ్గరలోనే ఓ అద్దె ఇంట్లో ఉంటూ, సొంత ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. అద్దె ఎక్కువ వస్తుందన్న లౌక్యంతో గంగాసాగరంలోని ఇంటిని ఓ ప్రభుత్వ కార్యాలయానికి అద్దెకిచ్చాడు. ఏడెనిమిది నెలలకల్లా కొత్త ఇల్లు తయారైంది. గృహప్రవేశం జరిగిపోయింది. పిల్లల చదువులు సాఫీగా సాగిపోతున్నాయి. మనుమరాలు ఇంటర్

చిత్రం: నర్సిం




రెండో సంవత్సరంలోకి, పెద్ద మనుమడు టెన్త్‌లోకి, చిన్న మనుమడు ఏడో తరగతిలోకీ వచ్చారు.

అంతా సవ్యంగానే ఉంది కానీ, సీతారామయ్యకే కష్టకాలమొచ్చింది. అప్పటికి ఆయన ఆరోగ్యం బాగా దిగజారిపోయింది. ఒంట్లో సత్తువ హరించుకు పోయింది. ఏదో ఒక పని పెట్టుకొని అక్కడికీ ఇక్కడికీ తిరుగాడుతుండేవాడు కాస్తా ఇప్పుడు ఓపిక చచ్చిపోయి ఇంటిపట్టునే ఉంటున్నాడు. చూపు మందగించింది. కాళ్ళు వాచిపోయాయి. ఆకలి పెరిగిపోయింది. వేళకు ముద్ద పడకపోతే కోపం వస్తోంది. ముగ్గురు పిల్లల్ని కని పద్దెనిమిదేళ్ళపాటు కిక్కురుమనకుండా కాపురం చేసి సహనానికి మారుపేరనిపించుకొన్న కోడలు - సర్వాధికారం క్రమక్రమంగా తనకు బదలీ అవుతున్న పరిణామ దశలో ఇప్పుడు ముసలాడి సణుగుళ్ళను, గొణుగుళ్ళను సహించలేకపోతోంది. ముసలాయన మంద లింపులు శ్రుతిమించి రాగాన పడితే, కోడలేమో జంకుగొంకుల్ని కట్టగట్టి అటకకెక్కించి మాటకు మాట అనేస్తోంది. కొడుకు ఉద్యోగానికి వెళ్ళి పోతాడు. పిల్లలు బడికెళ్ళిపోతారు. కోడలు టీవీలో సినిమాలు చూడ్డానికి ఇరుగింటికో పొరుగింటికో వెళ్ళిపోతుంది. ముసలాయన ఏదో చిన్న పనిమీద పది నిమిషాలపాటు కనుమరుగై వాకిట్లోకి తిరిగొచ్చే సరికి తలుపుకి తాళం వేలాడుతుంటుంది. అసహనంగా ఇంటిచుట్టూ పచార్లు చేస్తుంటాడు సీతారామయ్య. గంటో, రెండు గంటలో గడిచాక హుషారుగా తిరిగొస్తుంది కోడలు. ముసలాయన ఏదో అంటాడు ఆమెను. ఆమెకు చిర్రెత్తుకొస్తుంది. కోపం నిభాయించుకోలేక బిగ్గరగా కేకలు వేస్తుంది. లేదా, నాలుగిళ్ళూ వినేటట్లుగా వలవలా ఏడ్చేస్తుంది.

"నాకీ చెర ఇంకెన్నాళ్ళురా దేవుడా? అడివిలో చెట్టుగానైనా పుట్టకపోతిని గదరా సామీ" అంటూ రాగాలు తీస్తుంది.

పరోక్షంగా మామగార్ని విమర్శించడమే ఆమెకు పనైపోయింది. "పీనాసి జన్మ! డబ్బులన్నీ దాచు కోవడం తప్పితే ఓ మంచీ మన్ననా లేదు. ఎక్కడి కెళ్ళొస్తాడో, ఏం కొనుక్కు తింటాడో - ఇంట్లో వాళ్ళకు ఏమీ కొనుక్కురాడు. పిల్లలకు ఓ పావలా ఇస్తే ప్రాణం పోతుందేమో! పోయేటప్పుడు మూటగట్టి నెత్తిన బెట్టుకుపోతాడు గాబోలు" అంటూ ఉంటుంది పిల్లలతో.

క్రమేపీ ఆ ఇంట్లో రెండు భిన్నధ్రువాలు ఏర్పడిపోయాయి. ఇంట్లోని వాళ్ళందరూ ఒక ధ్రువం. సీతారామయ్య ఒక్కడూ మరో ధ్రువం. అతని గురించి పట్టించుకోవడం బొత్తిగా మానేశారందరూ. వరండాలో కుక్కిమంచంలో కూర్చునో, ఇంటి చూట్టూ గోడ ఆసరాగా చిన్నగా నడయాడుతూనో ఉంటాడు ముసలాడు. తన మసక కళ్ళ ముందు మెదిలే పిల్లల్ని పోల్చుకున్నప్పుడు అతడి బోసినోట చిరునవ్వు కదలాడుతుంది. మమకారంతో వాళ్ళను పలకరిస్తాడు. మనుమరాలు, పెద్ద మనుమడూ మూతి ముడుచుకొని, మౌనంగా తప్పుకుంటారు. ఈ రెండు ధ్రువాల్లో ఏవైపుగానీ మొగ్గు చూపనివాడు చిన్న మనుమడు సుబ్బూ ఒక్కడే! అయితే, ఆయనతో క్షణకాలమైనా గడిపే తీరికగానీ, ఓపికగానీ వాడికి లేవు. ఎప్పుడూ ఏదో తొందరలోనే ఉంటాడు వాడు. ఉదయం పూట బడి, సాయంకాలం ట్యూషన్ మినహాయిస్తే, ఇంటిపట్టున ఉన్న తక్కిన సమయాల్లోనూ ప్రతిక్షణం ఏదో అత్యవసర కార్యమే ఉంటుంది వాడికి. డాబా పైకెక్కి బిగ్గరగా చదువుతూనో, గొంతెత్తి సినిమా పాటలు పాడుతూనో, బాత్‌రూమ్‌లో కూనిరాగాలు తీస్తూనో, పిల్లలతో అట్టహాసంగా ఆడుకొంటూనో, అద్దె సైకిలెక్కి రయ్యి మంటూ చక్కర్లు కొడుతూనో ఉంటాడు. రాత్రి అన్నం తిని హోమ్ వర్కు చేసుకొంటూ అలాగే వాలి నిద్రపోతాడు. తెల్లవారాక మళ్ళీ యథాప్రకారం ఇవే కార్యక్రమాలు.



సీతారామయ్య రూపుదాల్చిన మౌనంగా మిగిలిపోయాడు ఆఖరికి.

ఆ రోజు ఉదయం మామూలుగానే బడికి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు సుబ్బూ. వాకిట్లో నిలబడ్డాడు. నాన్న ఇంట్లో లేడు. అన్న తనకంటే ముందుగానే వెళ్ళిపోయాడు బడికి. "అమ్మా ఎల్లొస్తా, అక్కా ఎల్లొస్తా..." అని బిగ్గరగా కేక పెట్టి పరుగందుకున్నాడు సుబ్బూ.

రెండు రోజులుగా వరండాలో నులకమంచంలో మూసిన కన్ను తెరవకుండా ముడుచుకు పడున్న సీతారామయ్య ఉలిక్కిపడ్డాడు.

* * *

సాయంకాలం బడి నుంచి తుపాకిగుండులా సర్రున వచ్చి టక్కున ఆగాడు సుబ్బూ. ఇంట్లో వాతావరణం ఏదో బరువుగా ఉన్నట్లనిపించింది. పుస్తకాల సంచీని దబ్బుమంటూ హాల్లో పడేసి, "అమ్మా పాలియ్యి, ట్యూషన్ కెళ్ళాలి" అంటూ బాత్‌రూమ్‌లోకి లగెత్తాడు. తపుకు తపుకున మొహం మీద మంచినీళ్ళు చల్లుకుని బయటికొచ్చి, తల్లి అందించిన పాలగ్లాసు అందుకుని గుటగుటా తాగేశాడు. ఒకటి రెండు పుస్తకాలు చేతబట్టుకొని బయటకు పరుగు తీయబోయాడు.

నాన్న వాణ్ణి నిలువరించాడు. "ఆగరా సుబ్బూ! మధ్యాహ్నం నించీ తాత నిన్నే కలవ రిస్తున్నాడు" అంటూ వాణ్ణి వరండాలో నులకమంచం వద్దకు నడిపించుకుపోయాడు. అక్క, అమ్మ, అన్న కదలకుండా నిలబడి అటువైపే చూస్తున్నారు. ఇరుగుపొరుగు వాళ్ళు ఇద్దరు ముగ్గురొచ్చి గుమ్మం వద్ద గుమిగూడారు.

నాన్న ముసలాయనకు దగ్గరగా వెళ్ళి, "నాన్నా! ఇదిగో, సుబ్బుడొచ్చాడు" అన్నాడు.

సీతారామయ్య కళ్ళు తెరిచి శూన్యంలోకి చూశాడు.

"సుబ్బూ వచ్చాడు నాన్నా!... ఇంకాస్త దగ్గరకు వెళ్ళరా!"

"వచ్చాడా?" అస్పష్టమైన స్వరం.

సుబ్బూ ముందుకు వంగి, ఆయన ముఖం మీద ముఖం పెట్టాడు.

సీతారామయ్య ఎండు పెదాలమీద మసక మసకగా సన్నటి చిరునవ్వు. "...మనవడా!... ఎల్లొస్తా!"

ఎండిన రొమ్ము పైకీ కిందికీ లేచి పడుతుంటే, ఆయన పెదాల మీద మౌనం తిష్ఠ వేసింది.

సుబ్బూ మంచం దగ్గర నుంచి ఇవతలికి వచ్చాడు. "ఏమైంది" అన్నాడు పరిస్థితి వెంటనే అర్థం కాక. "సరే, నేను ట్యూషన్‌కెళ్తున్నా" అని కేకేసి తుర్రుమన్నాడు.

సాయంకాలం దీపాలు పెట్టేవేళ వాడు ఇంటికి తిరిగి వచ్చేసరికి సీతారామయ్య వెళ్ళిపోయాడు. మంచం దిగి నేలమీద పడుకొని ఉన్నాడు. తలవైపున దీపం వెలుగుతోంది.

చుట్టపక్కాలకు కబురు వెళ్ళింది. ఆ రాత్రి శవజాగరణ.

తెల్లవారాక, చుట్టాలు ఒక్కొక్కరే వచ్చి దిగారు.

ఇంటి ముందు చావు తప్పెట్లు మోగాయి. వెదురుబొంగుతో పాడె తయారైంది. బంధువుల ముఖాల్లో విషాదపు నీడలు తప్పిస్తే, సీతారామయ్య కోసం ఏడ్చిన వాళ్ళెవ్వరూ లేరు. ఎండ నడినెత్తికి రాగానే పాడె పైకి లేచింది.

అన్నతోబాటుగా తండ్రి వెంట సుబ్బూ కూడా శ్మశానానికి నడిచాడు.

శవాన్ని గోతిలోకి దించారు. పైన మట్టి కప్పేశారు. సీతారామయ్య అదృశ్యమైపోయాడు.

పీనాసి జన్మ... పోయేటప్పుడు మూటగట్టి నెత్తిన పెట్టుకుపోతాడేమో... పీనాసి జన్మ... పోయేటప్పుడు...

అరే!... అరెరే!... ఆయన వెంట ఏదీ వెళ్ళలేదే! సిరివాడ నల్లగుట్ట కాలనీలో కట్టిన కొత్త ఇల్లు కూడా వెళ్ళలేదే! గంగాసాగరంలో పెద్ద మొత్తానికి అద్దెకిచ్చిన ఇల్లు కూడా వెళ్ళలేదే! అఖరికి ముద్దుల మనుమణ్ణి

"అమ్మా ఎల్లొస్తా, అక్కా ఎల్లొస్తా..." అని బిగ్గరగా కేక పెట్టి పరుగందుకున్నాడు సుబ్బూ. రెండు రోజులుగా వరండాలో నులకమంచంలో మూసిన కన్ను తెరవకుండా ముడుచుకు పడున్న సీతారామయ్య ఉలిక్కిపడ్డాడు.

భుజాలమీది కెక్కించుకున్న ముసలి కట్టెలా ఏభై ఏళ్ళ పాటు ఆయన్ని మోసిన నులకమంచం కూడా ఆయన వెంట వెళ్ళలేదే.. అరెరెరెరే!

ఇంటికొచ్చారందరూ. స్నానాలు చేశారు. చుట్టాలు కొందరు వెంటనే వెళ్ళిపోయారు. ఆకలికి నకనకలాడిన కొందరు వేడివేడిగా అన్నం తిని వెళ్ళారు. సాయంకాలానికల్లా ఎవ్వరూ లేరు.

సీతారామయ్య ట్రంకు పెట్టె చాలా పాతది. అయినా, చాలా గట్టిది. మేకుకు వేలాడుతున్న మాసిన చొక్కా జేబులోంచి తాళంచెవి వెతికి తీశాడు కొడుకు. పెళ్ళాం బిడ్డల్ని చుట్టూ కూర్చోబెట్టుకుని ట్రంకు పెట్టె తెరిచాడు. ముసలాడి అపాయింట్‌మెంట్ ఆర్డరు, రిటైరయినప్పుడు అందిన గ్రాట్యుటీ, ప్రావిడెంట్‌ఫండ్, పెన్షన్ తాలూకు కాగితాలు అందులో ఉన్నాయి. అవి పనికిరావు.

పనికొచ్చేవీ ఉన్నాయి. గంగాసాగరంలోని ఇంటికీ, సిరివాడ లోని ఇంటికీ సంబంధించిన ప్లాట్ల తాలూకు దస్తావేజులు, ఆ ఇళ్ళ నిర్మాణాలకు అయిన ఖర్చుల వివరాలు, బిల్లులూ ఉన్నాయి. బ్యాంకు ఖాతా పుస్తకం కూడా ఉంది. అందులో మడతపెట్టిన ఓ కాగితం. సీతారామయ్య దస్తూరీ. తన స్వార్జితాన్ని ఎవరెవరు ఏ మేరకు తీసుకోవాలో రాసిపెట్టాడాయన. గంగాసాగరం లోని ఇల్లు పెద్ద మనుమడికీ, సిరివాడలోని ఇల్లు చిన్న మనుమడికీ, బ్యాంకులో ఉన్న రొక్కం మనుమరాలి పెళ్ళికీ!

తన యావజ్జీవితంలోని సారాన్నంతా తానే తేనెటీగలా సంగ్రహించి దాచి ఇందరికీ ఇచ్చి వెళ్ళిపోయాడు సీతారామయ్య. అతనికి ముట్టిన ప్రతిఫలం ఏమిటి?

తారస్థాయి గొంతుకతో చెలరేగిపోయే సుబ్బూ ఆశ్చర్యకరంగా ఈ రెండు రోజుల నుంచీ మూగవాడైపోయాడు. ఎప్పుడైనా ఎవరితోనైనా తప్పనిసరై మాట్లాడవలసి వస్తే మంద్రస్వరంతో ముక్తసరిగా మాట్లాడుతున్నాడు. ఆలోచనా భారంతో మత్తిల్లిపోతున్నాడు.

ఆ రాత్రి కూడా తెల్లవారింది.

నిన్న బడికి వెళ్ళలేదు కదా! ఈ రోజు వెళ్ళాలి. సుబ్బూ కాలకృత్యాలు ముగించుకున్నాడు. తల్లి పెట్టిందేదో తిన్నాడు. పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకున్నాడు. ఇంట్లోంచి వాకిట్లోకి వచ్చాడు. "అమ్మా ఎళ్లొస్తా, అక్కా ఎళ్లొస్తా, అన్నా ఎళ్లొస్తా, నాన్నా ఎళ్లొస్తా..." అంటూ గుక్క తిప్పుకోకుండా కేక పెట్టాడు. ముందుకు దౌడు తీయబోయి ఆగిపోయాడు. వెనక్కి తిరిగి రెండడుగులు ఇంటివైపు నడిచి వచ్చాడు. వరండా ఖాళీగా ఉంది. పాత నులకమంచం కాళ్ళు పైకెత్తుకుని, ఇంటి బయటగోడకు ఆనుకుని ఉంది.

సుబ్బూ పెదాలు క్షణకాలం అస్పష్టంగా గొణిగాయి. వరండాలోకి చూపులు సారించాడు వాడు. పల్చటి నీటిపొరలు వాడి కంటి పాపల్ని అడ్డగించాయి. వాడి నోటిలోంచి మృదువుగా వెలువడింది ఓ పలుకు.. "తాతా, ఎళ్లొస్తా!"

అదే మాట ఆ రెండో క్షణంలోనే తార స్థాయిని అందుకొంది. "తాతా, ఎళ్లొస్తా!" తరిగేసిన కందగడ్డగా మారింది వాడి మొహం. వెళ్ళొస్తానని అంటున్నాడే గానీ వెళ్ళడం లేదు వాడు. "తాతా!... తాతా!..." అని నోరు వెళ్ళబెట్టి బిగ్గరగా ఏడుస్తూ అక్కడే నుంచుండిపోయాడు. వాడి రోదన విని బయటికి లగెత్తుకొచ్చిన అక్కా, అన్నా కూడా అరక్షణంలోనే బావురుమంటూ వాడితో శ్రుతి కలిపారు.

మృత సంజీవని లాంటి వాళ్ళ ఏడుపును కడుపునిండా జుర్రేస్తూ, వాళ్ళను మునురుకున్న గాలి కూడా ఆనందంగా ఏడ్చింది. ■



# కథా ముత్యాలసరం

## మేలైన కథల్ని ఏర్చి కూర్చేందుకు మరో మంచి ప్రయత్నం



**కథ - 1997**
సంపాదకులు: వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్
ప్రతులకు: నవోదయ, పల్లవీ,మైత్రి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌లు, ఏలూరు రోడ్, విజయవాడ - 2. పేజీలు: 106.
వెల: రూ. 30/-

రెంటాల జయదేవ

కథాసాహితి పతాకంపై 1990 నుంచి వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌లు ఏటేటా ఆ ఏటి ఉత్తమ తెలుగు కథలతో ఓ సంకలనాన్ని వెలువరిస్తూ వస్తున్నారు. 1997లో ప్రచురితమైన తెలుగు కథలలో నుంచి తాము ఉత్తమమైనవిగా ఎంచుకున్న 10 కథలను సంపాదకులు ఈ *కథ '97*లో అందించారు. పచ్చటి చెట్లతో, ఫలసాయంతో ఇంపుగా ఉన్న 'చొక్కావారి తోట' కాలగతిలో చివరికి 'కమర్షియల్ ఎస్టేట్స్' అవతారం ఎత్తడం ఓ చేదునిజం. సమాజంలో గడచిన కొన్ని దశాబ్దాలలో వచ్చిన భయంకర వ్యాపార సంస్కృతీ పరిణామాన్ని ఓ తోట కథగా కళ్ళకు కట్టినట్లు చిత్రించారు రచయిత అప్పల్నాయుడు. ఇక కొలకలూరి ఇనాక్ గుంటూరు జిల్లా మాండలికంలో రాసిన *గొడ్డ దొంగ* కథ దళిత చైతన్యాన్ని ప్రతిఫలిస్తుంది.

"ఎక్కడా మనసు లేని, మమత లేని, ప్రేమ లేని, అనురాగం లేని బావిగట్టు శృంగారమేనా .... జీవితేచ్ఛ?"
- పుట 102

కాలువ మల్లయ్య రచన *యుద్ధభూమి*లో ఉద్యమ సానుభూతిపరుడైన ఓ తెలంగాణ యువకుడు భూమితో పెనవేసుకుపోయిన తన బంధాన్ని తెంచుకోలేక, అలాగని భూమినీ అమ్ముకుండానూ ఉండలేక మానసికంగా సతమతమవడం ఇతివృత్తం. కథావస్తువు మాట అటుంచితే, కథ నడిచే తీరు పేలవమనిపిస్తుంది. సంభాషణల్లో రచయిత తెలంగాణ పరిస్థితుల్నీ, ఉద్యమ సానుభూతిపరత్వాన్నీ అతిగా గుప్పించడానికి ప్రయత్నించారు. రచయిత తన భావోద్వేగాలను పాత్రలపరంగా తెలియజెప్పే క్రమంలో కథ, శిల్పం - రెండూ కుంటుబడ్డాయనీ, సంభాషణలో లేనిపోని కృతకత్వం చోటుచేసుకుందనీ గుర్తించినట్లు లేరు. భూమిని ప్రేమించే మనోహర్ తానిక భూమికి దూరమవుతున్నానని అంతదాకా బాధపడి, ఆఖరికి మాత్రం "భూమిని స్వయంగా దున్నుకునే ఆ భూమిలో పనిచేసేవాడి చేతిలోకే అది పోయిం"దంటూ హఠాత్తుగా సంతోషించడం పాఠకుడికి ఒక పట్టాన మింగుడుపడదు. కథలో చెప్పదలుచుకున్నది ఒక ఎత్తైతే, పాఠకుడి మనసుకు హత్తుకొనేలా, జీవితదృశ్యాలు, సంఘటనలతో దాన్ని రంగరించి అందించడం మరో ఎత్తని ఇప్పటికే వందల సంఖ్యలో కథలు రాసిన కాలువ మల్లయ్యగారికి తెలీదనుకోలేం. మరి, 1997లో వెలువడిన ఉత్తమ కథల్లో ఇదొకటి అంటే- ఉన్నవాటిల్లో ఉత్తమం అనుకోవాలో, లేక తెలంగాణ దృశ్యాన్ని ఆవిష్కరిస్తోందనే కారణంగానే సంపాదకులు ఈ కథను ఎంపికచేశారో అర్థం కాదు.

కాగా, బి.ఎస్. రాములు *మెరుగు* కథలోని రంగవ్వ ఒకప్పటి సమాజంలోని స్త్రీలకు ప్రతీక. ఆమె సంక్లిష్టమయ జీవితాన్ని రచయిత ఇందులో చక్కగా విశ్లేషించారు. రంగస్థలమైనా, జానపద కళారూపాలైనా, ఆకాశవాణి అయినా, టీవీ చానళ్ళయినా ఆనంద శంకర (ఎ.ఎస్) రావు లాంటి కొందరు అవకాశవాదుల చేతుల్లోనే ఇరుక్కుపోవడం సమకాలీన సామాజిక విషాదమే. నాలుగు పాత్రలు వేటికవి చెప్పుకొనే ఆత్మకథలాగా విలక్షణ శిల్పంతో నడిచే కథ డాక్టర్ వి. చంద్రశేఖరరావు రాసిన *చిట్టచివరి రేడియో నాటకం*. చదువుకొని, లాయర్‌గా ఎదిగినప్పటికీ దేవరత్నం తన సాటి దళితుడైన ఓబులేసు పక్షాన న్యాయస్థానంలో పోరాడలేకపోతాడు. ముఠాతగాదాలకు ఆలవాలమైన రాయలసీమలో అగ్రకులాల పెద్దమనుషులకు ఎదురు నిలబడడానికి అతని ధైర్యం చాలదు. దళితులు పైకొస్తున్నారని చెబుతుంటారే కానీ, వాస్తవంలో దేవరత్నం లాంటివారి బతుకులోని చేతగానితనం మనల్ని వెక్కిరిస్తుంది. మహమ్మద్ ఖదీర్‌బాబు రాసిన *దావత్* కథ ముస్లిమ్‌ల పెళ్ళిని నేపథ్యంగా తీసుకొని, ఆ వర్గంలోనూ పెళ్ళి పేరిట జరిగే హింసను కళ్ళకు కట్టించింది. గతానికీ, ఇప్పటికీ "సాయెబుల బతుకు మారలేదుగాని, కట్నాలు పెరిగిపోయాయి." చాలామందికి పరిచయం ఉండని ఓ నిర్ణీతవర్గపు జీవిత దృశ్యాన్ని ఖదీర్‌బాబు సమర్థంగా కథారూపంలో పెట్టారు. భార్య విజయని ప్రేమగా చూస్తూ, పనిలో మొనగాడిగా, ప్రాణాలకు తెగించైనా పక్కవాళ్ళకు సాయపడే వ్యక్తిగా మసలిన సోముడు ఆ తరువాత అన్నిరకాలుగా చితికిపోయి, ఎందుకూ కొరగాకుండా తయారయ్యాడంటే, "ఆ తప్పు ఈ మనిషిదా? ఈ మనిషి పడ్డ కష్టాలదా?" మొగుడూ పెళ్ళాల ప్రేమకతలో ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, విజయ పాత్ర ద్వారా వేసే కదిలించే ప్రశ్న అది.

నాగప్పగారి సుందరరాజు రాసిన *నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద* కథ అన్నెం పున్నెం ఎరుగని అమ్మాయిని వికృత సమాజ ప్రతీక అయిన బసివిరాజు (జోగిని) వ్యవస్థలోకి చేర్చడాన్ని చిత్రిస్తుంది. *రెప్పచాటు ఉప్పెన*లో ముసలాయనకు రెండో పెళ్ళాంగా, ఇద్దరు కొడుకులు, నలుగురు కూతుళ్ళకు సవతి తల్లిగా, చాకిరీచేసే యంత్రంగా మారిన మనిషి వరలక్ష్మి. అయితే, "కోరిక అనే బలమైన ఊహ శరీరాన్ని లొంగదీసుకుంటున్నా", "ఎక్కడా మనసులేని, మమతలేని, ప్రేమలేని, అనురాగంలేని బావిగట్టు శృంగారమేనా... జీవితేచ్ఛ" అన్న విచికిత్స ఆమెను పట్టి కుదుపుతుంది. మరి, అలాంటి అభాగ్య స్త్రీలు "నే రాయినయిపోతే బావుణ్ను... ఆలోచనలు రాని పిచ్చిదాన్నయితే బావుణ్ను" అనుకోవడం నిజంగా రెప్పచాటు ఉప్పెనే! కథకు పేరు పెట్టడంలో, వరలక్ష్మి మానసిక చిత్రణలో రచయిత్రి సి. సుజాత నేర్పు అభినందనీయం. ముచ్చటైన ముఖచిత్రం, అందమైన అక్షరాల కూర్పుతో, చూడగానే చదవాలనిపించేలా రూపుదిద్దుకున్న ఈ పుస్తకం వెల కూడా అందుకు మనల్ని ప్రోత్సహిస్తుంది. ఇక ఈ సంకలనానికి 10 మంచి కథలు దొరకడం గగనమైందన్న సంపాదకుల మాట, ఆ పరిణామాన్ని విశ్లేషిస్తూ, విమర్శకులు వల్లంపాటి వెంకట సుబ్బయ్య రాసిన ముందుమాట ఆలోచింపజేస్తాయి. ■